



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనకు స్వాగతం పలుకుతున్న యాజమాన్యం

రైతులను దగా చేసిన కేంద్ర ప్రభుత్వం

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి - ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మరోసారి రైతులను దగా చేసిందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. శనివారం కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 7న ప్రకటించిన మద్దతు ధరతో రైతులను మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని తెలిపారు. ఈనెల 7న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు కంటి తుడుపు చర్యగా ఉందని, న్యాయసమ్మతంగా లేదని చెప్పారు. పెట్టుబడి ఖర్చులు 50 నుంచి 200 శాతం పెరగగా పత్తి, జొన్న లాంటి పంటలకు అత్యంత తక్కువ మద్దతు ధర ప్రకటించి రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పంటపైనా రైతులు నష్టపోతున్నారని, దిగుబడి రాక ధర లేక ప్రకృతి వైపరీత్యాలతో, పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగి, వ్యవసాయం చేయలేక, భూములు వదులుకొని ఇతర వృత్తులు చేసుకునే పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన పెట్టుబడిపై 50 శాతం కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడారు. ఈనెల 30న జరిగే విజయవాడ మహాధర్నాకు రైతుల సమస్యలపై తరలి వెళ్లాలని కోరారు. జాతీయ రహదారుల్లో భూములు కోల్పోతున్న రైతులు, ఆర్‌డిఎస్, వేదవతి కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రైతులందరికీ ఇవ్వాలని, నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకోవాలని, విజయవాడ ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి. హనుమంతు, రాష్ట్ర కమిటీ సభ్యులు వనజ, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మధు, సిద్ధయ్య గౌడ్, లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

నగరానికే తలమానికం...

బత్తుల బిల్డర్స్ లేక్ ఫ్రంట్...

- బత్తుల బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరానికే తలమానికం బత్తుల బిల్డర్స్ లేక్ ఫ్రంట్ అని మేనేజింగ్ డైరెక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని నందికొట్కూరు రోడ్డులో నగరవనం ఎంట్రెన్స్ వద్ద బత్తుల బిల్డర్స్ వారి బత్తుల లేక్ ఫ్రంట్ మోడల్ విల్లాస్‌ను ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, తోగురు ఆర్థర్, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కుడా ఛైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన మోడల్ విల్లాస్‌లు కర్నూలు నగరంలో ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. అనంతరం బత్తుల బిల్డర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నాగార్జున రెడ్డి మాట్లాడారు. ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో జాతీయ రహదారిని అనుకుని, కర్నూలు నగరానికి అతి సమీపంలో బత్తుల లేక్ ఫ్రంట్ మోడల్ విల్లాస్‌ను ప్రారంభించామని తెలిపారు. బత్తుల లేక్ ఫ్రంట్ 20 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో 228 స్మార్ట్ విల్లాలు, ఇంటీరియర్, 50 వేల చదరపు అడుగుల క్లబ్ హౌస్, 50 పైగా సౌకర్యాలతో, 4 ఎకరాల గ్రీన్ స్పేస్ కలదని తెలిపారు. వీటితో పాటు బ్రోచర్‌లో చూపించిన విధంగా ప్రతి సౌకర్యాన్ని ఖచ్చితంగా సమకూరుస్తానని పేర్కొన్నారు. బిల్డింగ్‌ని వందకి వంద శాతం మోడల్ చూపించిన విధంగానే కడతామని తెలిపారు. నాణ్యతలో ఎలాంటి కాంప్రమైజ్ ఉండదని, తనకు వచ్చే మార్జిన్లో కాంప్రమైజ్ ఉంటుది తప్ప ప్రొడక్ట్‌లో ఎలాంటి కాంప్రమైజ్ ఉండదని తెలిపారు. ఈ ప్రాజెక్టుని ఏపిలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఇండియాలోనే నెంబర్ వన్ బిల్డర్‌గా ఎదగడానికి ఈ ప్రాజెక్టు తనకి మొదటి స్టెప్ అన్నారు. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి కచ్చితంగా అవకాశం ఇవ్వాలని, 1.5 కి.మీ ఇంటర్నల్ జాగింగ్ ట్రాక్ ఇస్తున్నానని, నెక్స్ట్ జనరేషన్ పిల్లలకు స్విమ్మింగ్ తెలిసి ఉండాలని, డ్యాన్సింగ్ తెలిసి ఉండాలని, నేర్చుకోవడానికి ఔట్ డోర్ ఆక్టివిటీస్ ఇస్తున్నామని తెలిపారు. సేఫ్టీ విషయానికి వస్తే కేవలం రిజిస్ట్రేషన్ వెహికల్స్ తప్ప మిగతా ఎటువంటి వెహికల్‌కి లోపలికి అనుమతి లేదని చెప్పారు. తీసుకున్న ప్రతి రూపాయికి మీ ఇంట్లో వాడిలాగా క్వాలిటీలో శ్రద్ధ చూపుతూ ప్రతి ఇంటిని కడతానని తెలిపారు. బత్తుల లేక్ ఫ్రంట్ మోడల్ విల్లాస్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కొనసాగిన ఆందోళనల పర్వం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో వారం రోజుల్లో ఆందోళన పర్వం కొనసాగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ హైవే పుట్‌వే బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు జాతీయ రహదారిని ముట్టడించి పనులను నిలిపివేశారు. పెరిగిన భూముల విలువను వెంటనే తగ్గించాలని, ప్రజా ప్రతినిధులకు , అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని అప్పటికీ స్పందించక పోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పట్టణ పౌరసంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం తీర్మానించారు. బడి స్థలానికి అక్రమంగా నమోదు చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, కొట్టంబడి స్థలంలో కమ్యూనిటీ హాలు, లేదా సచివాలయాన్ని నిర్మించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఇందిరాగాంధినగర్‌లో ఉన్న పాఠశాల స్థలానికి అక్రమంగా ఇచ్చిన పట్టాను రద్దు చేయాలని, ఆ స్థలంలో వార్డు ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పాఠశాల పూర్వపు విద్యార్థులు, అఖిలపక్ష నాయకుల నినాదాలు చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో పెంచిన కరెంటు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు విద్యుత్ భవనం ముందు నిరసన తెలిపారు. రచ్చుమర్రి గ్రామం నుంచి మాధవరం పోలీసు స్టేషన్ వరకు నిరసన యాత్ర చేపట్టారు. దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రచ్చుమర్రి గ్రామంలో దాడికి గురైన బాధితులను పరామర్శించి, బాధితులతో బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రచ్చుమర్రి గ్రామ దళిత పేట నుంచి మాధవరం గ్రామం వరకు నిరసన పాద యాత్ర నిర్వహించారు. మాధవరం పోలీసు స్టేషన్ ముందే అరగంట పాటు రాస్తారోకో నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిని సిఐ శ్రీనివాసులుకు అందజేశారు. బిజెపి ఎంపీ బ్రిజుభూషన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ భారంపై ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులపై భారాలు మీద భారాలు మోపుతోంది. పన్నులు, ఛార్జీలు పెంచుకుంటూ పోతోంది. జూన్ ఒకటి నుండి పెంచిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను భారీగా పెంచేసింది. ఒక గజానికి గతంలో రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.1500 ఉంటే ఇప్పుడు రూ.3500 లకు పెంచింది. కొన్నిచోట్ల రూ.4,500 కు పెంచింది. జిల్లాలో ప్రజలపై అదనంగా రూ. 50 కోట్లు భారం వేసింది. పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారం వేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలను వేయడమే పనిగా పెట్టుకున్నదని అన్నారు. ఇంత భారంగా ఉన్నప్పుడు ప్రజలు ఏరకంగా ఇంటి స్థలాన్ని కొనగలుగుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని హెచ్చరించారు.

అవీ..ఇవీ..అన్నీ..: మేయర్ బివై రామయ్య అధ్యక్షతన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. సమస్యలపై ఎప్పుడు అడిగినా మేయర్ దాటవేస్తున్నారని కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని జిబి ఫంక్షన్ హాలులో పేద ముస్లిం యువతీ, యువకుల సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏరువాక పౌర్ణమిని నిర్వహించారు.



బడి తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక

- ఎస్ఎస్ఎ ఎపిసి డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలను తీసుకుంటోందని తెలిపారు. ప్రతి విద్యార్థికీ స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫారాలు, బెల్ట్, డిక్షనరీలు, టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్‌తో కూడిన జగనన్న విద్యా కానుకను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. జిల్లాలోని 25 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2,92,955 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించడానికి పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష సమగ్ర కార్యాచరణను రూపొందించిందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రతి మండల స్టాక్ పాయింట్ నుంచి జగనన్న విద్యా కానుక కిట్లు 90 శాతం పాఠశాలలకు చేరాయన్నారు. మిగిలిన 10 శాతం పాఠశాలలకు ఆదివారం నాటికి చేరుతాయన్నారు. ప్రతి మండల స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్ల ప్యాకింగ్, రవాణా కోసం ప్రభుత్వం రూ.49,04,128 మంజూరు చేసిందన్నారు. ఈ మొత్తాన్ని ఆయా మండల విద్యాశాఖ అధికారుల అక్కౌంట్లలో జమ చేశామన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జగనన్న విద్యా కానుక కిట్లను తయారు చేసి పాఠశాల ప్రారంభం రోజే ఒక పండగ వాతావరణంలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

పాడైన పంచాయతీ రాజ్ రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు..
- పట్టించుకోని అధికారులు...

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని జొన్నగిరి నుంచి పగిడిరాయి, చెన్నంపల్లి నుంచి రామలింగయ్య పల్లి, పగిడిరాయి నుంచి ఉప్పర్లపల్లి గ్రామాల పంచాయతీ రాజ్ రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడైపోయిన రోడ్లకు పంచాయతీ రాజ్ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. ఆస్పత్రికి వెళ్లాలంటే గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోల్లో ప్రయాణం ఇబ్బందిగా కొనసాగుతోంది. ఏమైనా అత్యవసరం జరిగితే ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఇక్కడ ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాలు పడితే ఈ రోడ్లు మరి దారుణంగా తయారవుతాయి. టూ వీలర్‌పై వెళ్లాలంటే గంటల కొద్దీ ప్రయాణం కొనసాగుతుంది. తుగ్గలికి రావాలంటే ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులైనా చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జొన్నగిరి రోడ్డు



మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - సి.బెళగల్

సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు (51) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు కర్నూల్ నగరంలో నివాసముంటున్నారు. ప్రతి రోజూ కర్నూలు నుండి బెళగల్‌కు విధులకు హాజరయ్యేవారు. రోజుమాదిరిగానే శనివారం ఉదయం కర్నూలులో గుండ్రేవుల బస్సు ఎక్కారు. సీటులో కూర్చున్న ఆయన నిద్రలోకి జారుకున్నారు. బస్సు గుండ్రేవుల వెళ్లి మళ్లీ కర్నూలుకు బయల్దేరడానికి సిద్ధమవుతుండగా సీట్లో అలాగే ఉన్న హెడ్ కానిస్టేబుల్ దగ్గరికి కండక్టర్, డ్రైవర్ వెళ్లి ఆయనను పిలిచారు. అయనను తట్టి లేపేందుకు యత్నించగా ఏమాత్రం చలనం లేకపోవడంతో వెంటనే బెళగల్ ఎస్సైకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయనను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య కాంచన, ఒక కూతురు నవ్యశ్రీ ఉన్నారు. విషయం తెలిసి బెళగల్, కోడుమూరు, గూడూరు ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, సహచర సిబ్బంది దిగ్భ్రాంతి చెందారు.

ఘనంగా ధ్వజస్థంభ ప్రతిష్ట

ప్రజాశక్తి - తుగ్గలి : తుగ్గలి మండలం నునసరాల గ్రామంలో సోమలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రూ.1.30 కోట్లతో నిర్మించిన దేవాలయాన్ని కర్ణాటక విరాపాక్షి దేవాలయ సంస్థాన పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ప్రత్యేక పూజలతో ప్రారంభిచారు. గోపురం, ధ్వజ స్థంభంను ఆయన ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు వసతులు నిర్వహించారు. కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, కెడిసిసి మాజీ వైస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, కెడిఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టిడిపి పత్తికొండ ఇంచార్జి కెఇ శ్యాంబాబు, తుగ్గలి రమణా రెడ్డి, సర్పంచి గోపాల్ రెడ్డి, తుగ్గలి శ్రీనివాస రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రంగారెడ్డి, రమణా రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మల్లికార్జున బందోబస్తును నిర్వహించారు.

రాతి దూలం పోటీలు ప్రారంభం : ఆలయ ప్రతిష్ట వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన రాతి దూలం పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో పండుగకు, పబ్బాలకు రాతిదూలం పోటీలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గతంలో పోటీలను చూడడానికి వేరే ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాతిదూలం పోటీల వల్ల గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంటుందన్నారు.

భారత డ్రాగన్ బోట్ శిక్షణ శిబిరానికి ఏపి క్రీడాకారులు

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

భారత డ్రాగన్ బోట్ తుది జట్టు ఎంపిక కోసం డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రం అలిపిలో నిర్వహించనున్న శిక్షణ శిబిరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. క్రీడాకారులు రమేష్, గుప్త (కర్నూలు), లలిత ఆదిత్య (తిరుపతి)లు ఎంపికైనట్లు భారత సంఘం కార్యదర్శి రేజి కే.సుధాకర్ నుండి ఉత్తర్వులు అందాయని డ్రాగన్ బోర్డ్ ఎపి అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆగస్టు 7 నుంచి 13వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరగనున్న 16వ ప్రపంచ డ్రాగన్ బోట్ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డ్రాగన్ బోర్డ్ ఆంధ్రప్రదేశ్ అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రెటరీ మంచికంటి అవినాష్, వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్ర శేఖర్, శిక్షకులు కాశీ రావు, యూసుఫ్, రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు నాగరాజు, జిల్లా ప్రైవేట్ స్కూల్స్ పిఇటిల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, నాయకుడు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీధర్ రెడ్డి

13న ఉచిత మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పత్తికొండ : పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఉచిత మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధురి శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎపి శిక్షణ శాఖ నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో పత్తికొండ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కంపెనీలు గ్రీన్‌టెక్, హెటిరో, అరబిందో ఫార్మా, హీల్ మై ఫ్యామిలీ, డీ మార్ట్, మనప్పురం ఫైనాన్స్, బ్లూ ఓషన్, శ్రీ రామ్ చిట్స్, ఫైనాన్స్, జెబిఎం, వైఎస్‌కె ఇన్ఫోటెక్, ఎస్–ఎల్‌వి ఎంటర్ప్రైజెస్, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పిజి, ఐటిఐ, డిప్లొమా, ఎంబిఎ, బిటెక్ చదివిన వారు అర్హులని, 18 నుండి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, ఎంపికయిన అభ్యర్థులకు నెలకు 10 వేల రూపాయల నుండి 25 వేల వరకు జీతం ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, http://bit.ly/3pxO1iv లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 8309283980, 8500783459, 9014588552 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



మేయర్ బివై రామయ్యకు వినతి పత్రమిస్తున్న పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం

పెరిగిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు రద్దు చేయాలి

- కౌన్సిల్ తీర్మానం చేయాలని మేయర్‌కు వినతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించాలని పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం మేరకు శనివారం నగర క్యాంప్ ఆఫీసులో మేయర్ బివై రామయ్యకు పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. భూముల రిజిస్ట్రేషన్ విలువతో పాటు యూజర్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. నగర నాయకులు ఎన్. శ్రీనివాసరెడ్డి, ఎం.యాకోబు, డి.కామేశ్వరరావు, కె.శ్రీనివాసులు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్రెండ్ షిప్ కప్ ఫుట్ బాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్ : స్థానిక బి.క్యాంప్ బాలికల గవర్నమెంట్ పాఠశాల మైదానంలో ఫ్రెండ్ షిప్ కప్ ఫుట్‌బాల్ పోటీలను వ్యాపార వేత్త వివేక్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం సిఈఓ విజయకుమార్ మాట్లాడారు. ఈ పోటీల్లో గద్వాల, మహబూబ్ నగర్, పెబ్బేరు, నంద్యాల, కర్నూలుకు చెందిన 8 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఐఎఎస్ఎల్ బిఇడి కళాశాల లెక్చరర్ బి.సుధీర్ రాజు, ఎఇఇ రంగడు, స్కేటింగ్ సెక్రటరీ సునీల్ కుమార్, విశ్రాంత డ్రిల్ల్ మాస్టర్ చిట్టిబాబు, వినయ్, నవాజ్, విజయ్ కుమార్, బ్రహ్మ, హర్ష, మహబూబ్ నగర్ జట్టు డిఎస్ఎ కోచ్ సాయి, పోటీల నిర్వాహకుడు పాల్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు నిలిపివేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - వెల్దుర్తి : వెల్దుర్తి మండలంలో ప్రయివేటు పాఠశాలలు నిర్వహిస్తున్న ముందస్తు అక్రమ అడ్మిషన్‌లపై చర్యలు తీసుకుని నిలిపివేయాలని సిపిఐ మండల కన్వీనర్ టి.కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేకుల షెడ్డుల్లో తరగతులు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలన్నారు.

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ల ఎన్నిక

ప్రజాశక్తి - మద్దికెర : మండలంలోని బురుజుల గ్రామానికి చెందిన పులికొండ మాదిగను, రామ్ కొండ వెంకటేశ్వర్ల మాదిగను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్లుగా వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఎన్నిక చేశారు. జూలై 7న విజయవాడలో జరిగే జాగృతి సభను విజయవంతం చేయాలని కోరారు.

పలువురు హెచ్ఎంలు బదిలీ

ప్రజాశక్తి - తుగ్గలి: మండలంలోని వివిధ గ్రామాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల హెచ్ఎలు, ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. తుగ్గలి ఉన్నత పాఠశాలకు విజయలక్ష్మి, పెండేకల్లు ఆర్ఎస్‌కు నరేంద్ర, జొన్నగిరికి ఉపేంద్ర, ఎద్దులదొడ్డికి జాకీర్, పగిడిరాయికి గిడ్డెమ్మ తదితరులను హెచ్ఎంలుగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 12న ఆయా పాఠశాలలో హెచ్ఎలు బాధ్యతలు చేపట్టనున్నారని ఎంఇఒ రామ వెంకటేశ్వర్లు తెలిపారు.

12న కలెక్టరేట్లో స్పందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ఈనెల 12న స్పందన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులు స్పందన కార్యక్రమానికి విచ్చేసి తమ వినతులను అందజేయాలన్నారు.

రాయలసీమ కళలకు పుట్టినిల్లు

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్ : రాయలసీమ కళలకు పుట్టినిల్లు అని డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి తెలిపారు. శనివారం స్థానిక టీజీవి కళాక్షేత్రం టీజీవి డాన్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో వేదాంతం రామలింగ శాస్త్రి, ఆయన సతీమణి దుర్గాభవానిలకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆణిముత్యాలను వెతకవలసిన అవసరం లేకుండా కర్నూలుకు సంగీత నృత్య కళాకారులు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం రామలింగ శాస్త్రి దంపతులను పదివేల రూపాయల పారితోషకంతో పాటు నూతన వస్త్రాలను సమర్పించి పాదపూజ, అభిషేకం నిర్వహించారు. అనంతరం చిన్నారులు నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ వసంత కిరణ్, కరీముల్లా, తేజ, దేవిశ్రీతో పాటు లలిత కళా సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



రామలింగశాస్త్రి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బిజెపి ఎంపీని అరెస్ట్ చేయాలి : ఆవాజ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేసి శిక్షించాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, మొహమ్మద్ షరీఫ్‌లు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంపీ పదవి నుండి, మల్ల యోధుల ఫెడరేషన్ అధ్యక్ష పదవి నుండి తక్షణమే తొలగించాలన్నారు. ఢిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్‌లో మహిళా రెజ్లర్లు ఆందోళన చేసినప్పటికీ మోడీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాత పోలీసులు కేసు నమోదు చేశారే తప్ప ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం శోచనీయమన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న మహిళా మలయోధులకు అండగా ఆవాజ్ నగర కమిటీ నిలబడుతుందని తెలిపారు. తక్షణమే ఎంపీని అరెస్ట్ చేసి శిక్షించాలని, ఇటువంటి చర్యలు పునరావత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE : CUM : MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL :: KURNOOL.

M.V.O.P.NO. 108/2023

1. Shek Shekshavali and 4 Others ....Petitioners

VERSUS

1.S.Shaheensha
2.IFFCO-TOKIO General Insurance Co. Ltd.,
3.Shaik Ibrahim. ....Respondents.

Respondent No.1and 3

1. S.Shaheensha, S/o S.Anwar Pasha, Major, Owner of the vehicle, Muslim, R/o.H.No.76-111-46-22-6, Nirmal Nagar, Bellary Chowrasta, Kurnool City & District - 518 003.

3. Shaik Ibrahim, S/o Shaik Mahammad Gouse, Aged 29 years, Driver of the vehicle, R/o H.No.76/97-366-6, weaker section Colony, Kallur, Ulchala road Kurnool City & District - 518 003.

Where as the petitioners has filed said case against you for compensation under M.V. Act. If you have any objections for the same may appear either in person or through advocate on 13 -06-2023 at 10-30 A.M. before the said court, failing which the matter will be decided in your absence.

Sri. M.L. Srinivasa Reddy,
Advocate for petitioner,
CellNo. 9440290266
KurnoolDist. A.P.

వితనాలకు నోచని ఆర్‌బికెలు...

- విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినా రైతులకు లాభం లేదు..?


ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రుతుపవనాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలు కావాలి. మండలంలోని ఆర్‌బికెల్లో కేవలం వేరుశనగ, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు మాత్రమే రైతులకు ఇస్తున్నారు. రైతులు అత్యధికంగా సాగు చేసే పత్తి, మిరప, ఉల్లి వంటి వాణిజ్య పంటల విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన విత్తనాలు లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. కేవలం ఆర్‌బికెల్లో నమోదు చేయించుకున్న రైతులకు రూ.9300 ధర కలిగిన కె6 వెరైటీ వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం రాయితీతో, జీలుగా, పిల్లి పెసర విత్తనాలను మాత్రమే అందజేస్తోంది. రైతులు చేసేదేమీ లేక ఎమ్మిగనూరు పట్టణంలోని విత్తన దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. పత్తి ఎస్ 7067 రకం, సిజెంటా 2043 రకం మిరప విత్తనాలకు మంచి డిమాండ్ ఉంది. వ్యాపారులు చెప్పిందే ధర. ఎంఆర్‌పికే ఇవ్వాలి కదా అంటే స్టాక్ లేదని బిల్లు మాత్రం రూ.950, రూ.850 వేస్తున్నారు. ఎక్కువ మాట్లాడితే ఎక్కడైనా తీసుకో అని బయటకు పంపిస్తున్నారు. రైతులు చేసేదేమీ లేక విత్తన వ్యాపారులు చెప్పిన ధరకే కొని నష్టపోతున్నారు. ఇటీవల జిల్లా విజిలెన్స్ అధికారులు ఎమ్మిగనూరులో విత్తనాల దుకాణాలపై దాడులు నిర్వహించారు. వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయాలు ఆపడం లేదు. యథేచ్ఛగా అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

విత్తన చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎఒ మహేశ్వర్ రెడ్డి

పట్టణంలోని శ్రీపంచముఖి ట్రేడర్స్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీబీర లింగేశ్వర ఏజెన్సీ, రేవతి సీడ్స్ దుకాణాల్లో శనివారం ఎఒ మహేశ్వర్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... సర్టిఫికెట్ లేకుండా, రైతులు సంతకాలు లేకుండా, స్టాక్ అప్‌డేటేషన్ లేకుండా విత్తనాలను అమ్ముతున్నందుకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో పత్తి 518 ప్యాకెట్లను నిలిపేశారు. దీని విలువ రూ.4,41,862, మిరప 618 ప్యాకెట్లు, రూ.15,69,635, పంచముఖి ట్రేడర్స్‌లో పత్తి 1421 ప్యాకెట్లు, రూ.12,07,850, మిరప 933 ప్యాకెట్లు, రూ.5,99,710, శ్రీబీర లింగేశ్వర ట్రేడర్స్‌లో పత్తి 1210 ప్యాకెట్లు, రూ.10,32,130, మిరప 754 ప్యాకెట్లు, రూ.6,45,288, రేవతి సీడ్స్ దుకాణంలో పత్తి 2235 ప్యాకెట్లు, రూ.16,73,350, మిరప 4165 ప్యాకెట్లు, రూ.24,42,960, కంది 80 ప్యాకెట్లు, రూ.18,400 మొత్తం రూ.96,31,185 విత్తనాలకు స్టాప్ సేల్స్ ఆర్డర్ జారీ చేశామని తెలిపారు.



పంచముఖి ట్రేడర్స్‌లో తనిఖీలు చేస్తున్న ఎఒ మహేశ్వర్ రెడ్డి

గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి - చిప్పగిరి



రోడ్డుకు భూమి పూజ చేస్తున్న వైసిపి నాయకులు

మండలంలోని ఏరూరు గ్రామం నుంచి బంటనహాల్ గ్రామానికి గ్రావెల్ రోడ్డుకు శనివారం భూమిపూజ చేశారు. ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, చిప్పగిరి ఎంపిపి హేమలత మారయ్య, వైసిపి మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి భూమి పూజ చేసి గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం వైసిపి మండల్ కన్వీనర్ ఏరూరు రంగస్వామి మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ఆదేశాల మేరకు ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత మారయ్య సహకారంతో ఏరూరు గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఏరూరు గ్రామం నుంచి బంటనహాల్ రైల్వేస్టేషన్ వరకు సుమారు 5.5 కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య మాట్లాడుతూ... రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు రాజన్న, శ్రీధర్, షేకన్న, బాలకృష్ణ, సతీష్, పరమేష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని



బహుమతులు అందజేస్తున్న సుభాష్ చంద్రబోస్

ఆదోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 35 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలకు వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ ఛైర్మన్ శాంతను గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, సమ్మర్ క్యాంపు మెమొంటో అందజేశారు. సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ... వేసవి శిబిరాల ద్వారా వివిధ అంశాలపై విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ శాంత మాట్లాడారు. చినిగిన చొక్కానైనా వేసుకోగాని మంచి పుస్తకం కొనుక్కుని చదవాలని తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ స్వర్ణలత, మాజీ జడ్‌పిటిసి రాంభీమ్ నాయుడు, శ్రీనివాసులును శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. రికార్డు అసిస్టెంట్ దేవేంద్ర, మంగమ్మ పాల్గొన్నారు.

'దీక్ష'లో విద్యార్థులకు గ్రాండ్ వెల్కమ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



విద్యార్థులను ఆహ్వానిస్తున్న యాజమాన్యం

పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో సిఒఒ సృజనా రెడ్డి, సిఇఒ తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. మొదట సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం సిఒఒ సృజనా రెడ్డి, రెండో సంవత్సరం విద్యార్థినులు నీనా, ఫీభిలు మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగత ప్రసంగంతో ఆహ్వానించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను అలంకరించి మిఠాయిలతో స్వాగతం పలికారు. అనంతరం దీక్ష జూనియర్ కళాశాల అకడమిక్ ఆఫీసర్లు పవన్, శివ, 35 మంది అధ్యాపకులను విద్యార్థులకు పరిచయం చేసి వారి టీచింగ్ ఫీల్డ్ అనుభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా సిఇఒ తిరుమల రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రయివేట్ జూనియర్ కళాశాలల కంటే తక్కువ ఫీజుతో, విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించడం దీక్ష కళాశాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తమపై నమ్మకముంచి పిల్లలను తమ కళాశాలలో చేర్చినందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈఏడాది వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఈఏడాది ఇంటర్ జనరల్ సిలబస్‌తో పాటు ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్, ఎపి ఎంసెట్ ప్రత్యేక శిక్షణ ఉచితంగా అందిస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఏరూరు గ్రామంలో పోలీసులు నిర్వహించిన సోదాల్లో అక్రమ కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచారం మేరకు ఏరూరు గ్రామంలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. డేగులపాడు గోపాల్ ఇంట్లో కర్ణాటక మద్యం 127 హేవార్డ్స్ బీర్స్, 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. కర్ణాటక మద్యం అమ్మినా, తీసుకొచ్చినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను కూడా గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో తాగునీటి పైపులైను ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దకడబూరు



నీటిని వదులుతున్న నాయకులు

పెద్దకడబూరు గ్రామంలోని 2, 10వ వార్డులకు జడ్‌పిటిసి నిధులు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పైపులైన్, కుళాయిలను శనివారం ప్రారంభించారు. సర్పంచి రామాంజనేయులు ఆధ్వర్యంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు బ్రహ్మయ్య ఆచారి, కోసిగి బసన్నలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. ఈ రెండు వార్డుల్లోని కుటుంబాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవని తెలిపారు. వారు సమస్యలను అధిగమించేందుకు స్థానిక బస్టాండ్ నుంచి రూ.2 లక్షల వ్యయంతో ప్రత్యేక పైపులైన్, 12 కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- గ్రామాల్లో దాహం... దాహం..!

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహం తీర్చేందుకు ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలు నీరుగారుతున్నాయి. ఇందుకు నిదర్శనమే హనువాల్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కాంట్రాక్టర్. ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా కౌతాళం మండలంలోని తోవి, ఎరిగేరి, బదినేహాల్, కుంటనహాళ్ గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. ఈ ట్యాంక్ నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. గ్రామాలకు మాత్రం తాగునీరందకపోవడంతో ప్రజలు దాహంతో ఇబ్బంది పడుతున్నారు. వేసవి కావడమే కాకుండా గ్రామాల్లో ఉత్సవాలు, జాతరలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో తాగునీరు ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామాలకు వచ్చిన బంధుమిత్రులకు కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితిలో గ్రామస్తులు ఉన్నారు. తోవి గ్రామానికి సుమారు 15 రోజులవుతున్నా తాగునీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం రాత్రనక, పగలనక వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎరిగేరి గ్రామంలో పరిస్థితి కూడా దారుణంగా ఉంది. కుంటనహాల్ గ్రామంలో 'గడపగడపకు'లో ప్రజలు అధికారులు, పాలకుల దృష్టికి తాగునీటి సమస్యను తీసుకెళ్లారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, ఈ గ్రామాలకు తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీ బిందెలతో ఉన్న ప్రజలు



పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి

- శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదోని నుంచి ప్రధాన పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తానని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రస్థానం, ప్రజాబలం, ఇతర వివరాలు, ఇరు పార్టీల అధినేతలకు సమర్పించామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరగా ఇరువురి నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. ఈనెల 12న తన పుట్టినరోజు సందర్భంగా రాజకీయ అజెండా ప్రకటిస్తానని వెల్లడించారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్ అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందన్నారు. చెంతనే తుంగభద్ర నది ప్రవహిస్తున్నా సాగు, తాగునీటి కోసం కౌతాళం, కోసిగి, ఆదోని, పెద్దకడబూరు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. వర్షాధారంపైనే వ్యవసాయం సాగుతోందని, పెట్టుబడి కూడా రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని ఈ ప్రాంత వాసుల సహకారంతో సమైక్య ఉద్యమం నడిపామన్నారు. చట్టసభల్లో గళమెత్తితే తప్ప పనులు జరగవని గ్రహించామన్నారు. ఈ ప్రాంతంలోనే ఇరు రాజకీయ పార్టీలకు చెందిన వారు దశాబ్ద కాలంగా పరిపాలన సాగించినా సాగునీటి కోసం కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ ప్రాంత వాసులు మూడో వ్యక్తిని కోరుకుంటున్నారని పలు సందర్భాల్లో వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తనకు అండగా ఉన్నారని, వారి సహకారంతోనే వచ్చే ఎన్నికల్లో బరిలో నిలుస్తానని వివరించారు.

ఘనంగా బాలయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు శనివారం ఆదోనిలో ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి నందమూరి అభిమానుల సమక్షంలో ఆదోనిలోని సత్యం థియేటర్లలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భూపాల్ చౌదరి మాట్లాడుతూ... నందమూరి బాలకృష్ణ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తి కోరుకుంటున్నామని తెలిపారు. అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి పట్టణ కమిటీ సభ్యులు కలీముల్లా, తురేగల్ నజీర్ అహ్మద్, దయాసాగర్, రాందాస్ గౌడ్, కొండయ్య చౌదరి, రామకృష్ణ, కటారి రాజేంద్ర, మధుబాబు, బందే నవాజ్, మల్లికార్జున కేక్ కట్ చేసి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

మెరుగైన విద్యనందించాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- శ్రీజీవేశ్వర ఇంగ్లీష్ మీడియా స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో మెరుగైన విద్యనందించాలని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని శక్తి గుడి ఏరియాలో శ్రీజీవేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూలును ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద పిల్లలకు మెరుగైన విద్యనందించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, విద్యా కానుక అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ తారతమ్యం లేకుండా పేద విద్యార్థులందరికీ ఆర్థిక ప్రయోజిత పథకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 2014 నుంచి 19 వరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేసిన చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొనడం పచ్చి మోసమని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఆదోని ప్రజల సహకారంతో మరోసారి ఎమ్మెల్యేగా సేవలందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహ్మద్, సంఘం నాయకులు నాగరాజు, లక్ష్మన్న, గోవిందరాజులు ఉన్నారు.

యాంత్రీకరణతో ఎన్నో ప్రయోజనాలు

ఆదోనిరూరల్ : వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన, వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్పాదకత పెంపుదల కార్యక్రమంలో భాగంగా రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ పని ముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీటి వృథాను అరికట్టేందుకు ఫారంపాండ్స్ తవ్వుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతుల పంట దిగుబడి పెంచేందుకు రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్ల ద్వారా చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దహరివాణం, ఎడవల్లి, బలాదూరు, సంతేకుడ్లూరు గ్రామాలకు చెందిన 300 మంది రైతులు లబ్ధి పొందినట్లు చెప్పారు. రైతులు పంట పొలాలకు ఎక్కువ శాతం క్రిమి సంహారక మందులు వాడడం ద్వారా మట్టిలో ఉండే సహజ గుణాలు కోల్పోతున్నాయన్నారు. నీటిని, నేలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. వాటర్ షెడ్ కమిటీ ఛైర్మన్ సంతోష్, సర్పంచి రాము, ఎంపిటిసి వీరేశ్, బసప్ప, వైసిపి సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, హనుమంతప్ప, బిపి.బలరాం, బాలప్ప, గర్జప్ప, మీసేవ నాగరాజ్, సిద్ధప్ప, డీలర్ మారెప్ప పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

నేడు మోడల్ స్కూల్‌లో 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల



గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్షను ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. పరీక్ష ఒఎంఆర్ విధానంలో ఉండడంతో పాటు ప్రశ్నాపత్రం 5వ తరగతి సిలబస్ ఆధారంగా ఉంటుందని చెప్పారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ మీసేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ల వద్ద apms.apcfss.in వెబ్‌సైట్‌లో హాలు టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, హాలు టికెట్‌లో ఇచ్చిన సూచనలను జాగ్రత్తగా పాటించాలని సూచించారు. విద్యార్థులు రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్, డౌన్‌లోడ్ చేసుకున్న హాలు టికెట్‌తో పరీక్ష కేంద్రం గోనెగండ్ల మోడల్ స్కూల్ వద్ద ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

లియాఫీ నూతన జనరల్ బాడీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన 6వ లియాఫీ సర్వసభ్య సమావేశంలో ఎపిసి ఛైర్మన్ ఎం.నారాయణ రెడ్డి, జోనల్ అధ్యక్షులు జె.కృష్ణా రెడ్డి, కడప డివిజన్ అధ్యక్షులు జయ భారత్ రెడ్డి, సెక్రటరీ కదిరప్ప, కోశాధికారి టి.కృష్ణ సమక్షంలో లియాఫీ నూతన జనరల్ బాడీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.సిద్ధలింగ, కార్యదర్శిగా ఎస్.రామకృష్ణ, కోశాధికారిగా ఎం.రఫీక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఛైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదోని బ్రాంచి మేనేజర్ వై.హనుమంత రావు, ఐసియు అధ్యక్షులు హెచ్.ప్రకాష్, వీరా రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జగన్ మాయమాటలు ప్రజలు నమ్మరు...

- టిడిపితోనే ప్రజల 'భవిష్యత్తుకు గ్యారంటీ'
- టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాయ మాటలు నమ్మే పరిస్థితి లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం స్థానిక హెచ్‌ఆర్‌బి కల్యాణ మండపంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన 'టిడిపి మేనిఫెస్టో భవిష్యత్తుకు గ్యారంటీ' అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పరిపాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రజల కోసం ప్రకటించిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందని తెలిపారు. అద్భుతమైన పాలన అందించడానికి మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరూ కలిసి టిడిపి జెండా ఎగరవేయడానికి కృషి చేయాలని కోరారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పని అయిపోయిందని, రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, నియోజకవర్గంలో తిక్కారెడ్డి ఎమ్మెల్యే అవుతారని సోమిశెట్టి వెంకటేశ్వర్లు జోస్యం చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, పెద్దకడబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, సాతనూరు కోసిగయ్య, కొండగేని వీరారెడ్డి, పంపాపతి, నాడిగేని వీరారెడ్డి, లక్ష్మీకాంత్, గోపాల్, కప్పయ్య, ప్రభాకర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీలు వెంకటపతి రాజు, కోట్రేష్ గౌడ్, ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, భరద్వాజ్ శెట్టి, కృష్ణారెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమర్ సాబ్, గోపాల్ స్వామి, అశోక్ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, చిన్న భూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, పల్లెపాడు మాజీ సర్పంచి చంద్ర, తెలుగు యువత విజయ రామిరెడ్డి, నాడిగేని మహదేవ్, పవన్ కుమార్, వట్టేప్పగారి నరసింహులు, మేకల నరసింహులు, ఎంపిటిసి వెంకటేష్, సూగూరు నాగేష్, రాగన్న, మాలపల్లి చంద్ర, నరసన్న, ఎస్సీ సెల్ నాయకులు విజయ్, మారెప్ప, యోబు, ఎంపిటిసి రాజు, దావీదు, రాజా బాబు, బెళగల్ సర్పంచి రామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

'భవిష్యత్తుకు గ్యారంటీ'ని జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రకటించిన టిడిపి మేనిఫెస్టోపై 'భవిష్యత్తుకు గ్యారంటీ' చర్చా వేదికను జయప్రదం చేయాలని టిడిపి నాయకులు కోరారు. ఈనెల 12న ఉదయం 9.30 గంటలకు ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో చర్చ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం గోనెగండ్లలోని టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ సంక్షేమ పథకాలపై చర్చా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పథకాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలన్న అంశాలపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దిశా నిర్దేశం చేస్తామన్నారు. నాయకులు నజీర్ సాహెబ్, బేతాళ బడేసా, కృష్ణమ నాయుడు, తిరుపతయ్య నాయుడు, కులుమాల రాముడు, మదీనా వెంకటేశ్వర్లు, నూర్ అహ్మద్, నాగన్న, ఎస్ఎన్.మాబువలీ, ఎ.మిన్నెల్లా, జిలాని, గౌవుండా రహమతుల్లా, కొత్తింటి ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజల కళ్లుగప్పి విద్యుత్ చార్జీలు వసూలు

- మోటార్లకు మీటర్లు బిగిస్తే తీసేయండి
- టిడిపి ఇన్‌చార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

ప్రజల కళ్లుగప్పి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు వసూలు చేస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 నుంచి 2019వ సంవత్సరంలో వాడిన విద్యుత్ చార్జీల బిల్లు కట్టినా వైసిపి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో అదనంగా చార్జీలు వేసి రాష్ట్రాల్లో ప్రజలపై రూ.వేల కోట్లు వసూలు చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్ కోతలు విధిస్తూ, తాగేందుకు నీరు లేక ప్రజలు ఉక్కపోతతో ఉన్నా విద్యుత్ చార్జీలు మాత్రం గతం కంటే ఎక్కువ రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల బోర్లకు మీటర్లు బిగించి రైతు వెన్నెముకను విరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని విమర్శించారు. విద్యుత్ అధికారులు వచ్చి రైతుల మోటార్లకు మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని ఆమె రైతులను కోరారు. ప్రభుత్వంపై నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని తెలిపారు. నారాయణ రెడ్డి, నర్సప్ప, నారాయణ, న్యాయవాది వలీ, చంద్రశేఖర్, మసాలా జగన్, సూరి, గూళ్యం రామాంజనేయులు పాల్గొన్నారు.



ప్రజాశక్తిలో ప్రచురితమైన శీర్షికను చూపుతున్న కోట్ల సుజాతమ్మ

మృతుని కుటుంబానికి సుజాతమ్మ పరామర్శ

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని చెల్లెల చెలిమల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కురువ రంగస్వామి పాణ్యం సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శనివారం టిడిపి ఆలూరు ఇన్‌చార్జీ కోట్ల సుజాతమ్మ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బైక్‌పై వెళ్తూ పాణ్యం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. టిడిపి వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మండల నాయకులు బడి గింజలు రంగన్న, మలకన్న, పరమేష్ గౌడ్, వెంకట స్వామి గౌడ్, రామాంజనేయులు, చెల్లెల చెలిమల, బేతపల్లి సర్పంచులు చిన్న రామప్ప, మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.



పరామర్శిస్తున్న కోట్ల సుజాతమ్మ